◆ సురజాడ వీధి

# పోరాటు

## – పట్నాల ఈశ్వరరావు

మిల్లు సైరన్ కూత వినపడడంతో 'హమ్మయ్య' అనుకున్నాడు రామారావు. ఇక ఈరోజుకు 'డ్యూటీ' అయిపోయినట్టే. అలా అనుకోగానే మనసు తేలిక పడింది.

డ్యూటీ అయిపోయిందన్న ఆనందం– డ్యూటీ దిగాక ఎక్కడకు వెళ్ళాలన్న ప్రశ్న తలెత్తే సరికి హరించుకు పోయింది.

అందరిలా తనకీ ఇల్లుంది. కానీ ఆ ఇంట్లో అడుగు పెట్టగానే–అది ఇల్లులా కాక సమస్యల పాలెగూడులా కనిపిస్తుంది.

ఇల్లంటే భయం. ఇల్లాలంటే భయం.. పిల్లలంటే..?? అసలు తనంటేనే తనకు భయం తన నీడే తనని భూతంలా భయ పెడుతుంటే దారి తప్పి వ్యసనాల బాట పట్టాడు రామారావు.

ఠంగు.. ఠంగుమని గోడ గడియారం గంటలు కొట్టడంతో ఉలిక్కిపడింది రాధ. చిన్నముల్లు తొమ్మిదిని సూచిస్తోంది. ఇంకా ఆయన రాలేదు. అనుకొంది. సాయం కాలం ఐదు గంటలకు డ్యూటీ దిగిన మనిషికి ఇంకా ఇల్లు గుర్తుకు రాకపోవడం బాధ కలిగించింది.



అయితే.. ఇలాంటి రాత్రులు తరచుగానే ఎదురవుతుండడంతో అలవాటు పడిపోయింది రాధ.

గతం కళ్ళముందు కదలాడడంతో వర్తమానం రంగు వెలిసిన చిత్తరువులా వెక్కిరిస్తోంది.

ఎందుకిలా మారిపోయాడు తన భర్త!?

పెళ్ళయిన కొత్తలో తనని ఎంతో ప్రేమగా చూసుకునే వాడు. సాయంకాలం డ్యూటీ దిగి తిన్నగా ఇంటికి వచ్చేవాడు. షికారుగా, ఎక్కడైనా తీసుకొని వెళ్ళేవాడు. తన చేతో కొనిచ్చే మూరెడు మల్లెలే ముత్యాల దండలై మురిపించేవి. మైమరపించేవి.

తియ్యని కలగా మిగిలిపోయిన గతాన్ని నెమరువేసుకుని నిరాశగా నిట్టూర్చింది రాధ.

మరి ఇప్పుడో–

వేళకి ఇంటికి రాడు. ఇంట్లో ఉన్నంత సేపు చికాకుగా, అశాంతిగా గడుపుతాడు. కట్టుకున్న పెళ్ళాన్ని కొరివి దెయ్యంలా భావిస్తాడు. పిల్లల్ని పిశాచుల్లారా అని తిడతాడు. పెళ్ళాం.. పిల్లలు.. ఇవన్నీ తనని బంధించేసిన ఉక్కు సంకెళ్ళలా భావిస్తాడు.

తమ పెళ్ళినాటికి సిగరెట్టు కాల్చడం కూడా తెలియని మనిషి నేడు సమస్త వ్యసనాలకు బానిసై ఒకొక్క మెట్టు దిగజారి పోతున్నాడు.

ఎందుకిలా మారిపోయారంటే తనేం మారలేదంటాడు. కష్టపడే వాడికి కాస్త సరదాలుండొద్దా అంటాడు.

సరదాలనీ, వ్యసనాలనీ ఒకే గాటన కట్టి మాట్లాడుతాడు.

కష్టాలను మరపించే సరదాలుగా భావి

స్తాడు తప్ప జీవిత విలువలను, వ్యక్తిత్వాన్ని ధ్వంసం చేస్తున్న వ్యసనాలుగా పరిగణిం చడేం??

పతనమవుతున్న మనిషి తన పతనాన్ని కూడా సిద్ధాంతీకరించి మాట్లాడుతుంటే— వినే వాళ్ళకి ఆ వాదమూ నిజమేనని పిస్తుంది. మాటల్లో తనకెవుడూ ఓటమే!

ఉయ్యాలలోని చిన్నపాప ఏడవడంతో ఉలిక్కిపడింది రాధ. ఆలోచన్లోంచి తేరుకుని పాపను ఒళ్ళో వేసుకుని జోకొట్టడం మొదలు పెట్టింది. వద్దనుకున్నకొద్దీ ఆలోచన్లు కందిరీగల్లా చుట్టుముడుతూనే వున్నాయి. పగబట్టిన పాముల్లా వెంటాడుతూనే వున్నాయి.

నిజమే.. మనిషి రెక్కల కష్టం మరిపింపజేసే వినోదమేమయింది ఇవాళ.

ఒకనాడు వినోదంతో బాటు విజ్ఞానాన్ని, నైతిక విలువల్ని పెంపొందించే కళలు నేడు వచ్చి వ్యాపార సరుకులుగా మారిపోయాయి. బలహీనతల్ని రెచ్చగొడుతున్నాయి. మన సంస్కృతి ఏమిటో మనమే పోల్చుకోలేని దిశగా మనం నెట్టబడుతున్నాం.

అంతా గందరగోళంగా వుంది. జీవితం.. ఆలోచన్లు వలయాలు వలయాలుగా ఒక దాని చుట్టూ ఒకటి పరిభ్రమిస్తున్నాయి.

ఏది తప్పో, ఎవరిది ఒప్పో తెలియడం లేదు. కష్టాలను, సుఖాలను కలిసి పంచుకోవాల్సిన వాళ్ళం. కాట్ల కుక్కల కంటే హీనంగా ప్రవర్తించడం..!

ఛీ! ఛీ! తనమీద తనకే అసహ్యం వుడుఓంది. బ్రతుకంటే విరక్తి కలుగుతోంది.

కానీ.. పిల్లలు.. పాపం, పుణ్యం తెలియని పసిరేకులు.. వాళ్ళని తల్లిలేని అనాథలుగా ఊహలో కూడా భరించలేకపోతోంది.

ఏం చెయ్యాలి??

'రాజీ!?.. అవును అదే పరిష్కారంలా తోస్తుంది. తాత్కాలికంగానైనా ఇదే మంచిది. ఇంతకన్నా పోయేది, వచ్చేది లేదు'

ఆలోచన్లు ఒక కొలిక్కి వస్తుండగానే నిర్ణయం తీసుకుంది రాధ.

తలుపు చప్పుడవడంతో ఉలిక్కిపడి లేచి తలుపు తీసింది రాధ. రామారావు లోనికి రాగానే తలుపు గడియ పెట్టింది.

దండేనికున్న లుంగీ పంచ పట్టుకొచ్చి ఇచ్చింది. రామారావు విప్పి పడేసిన చొక్కా, ప్యాంటు తీసి కొక్కేనికి తగిలించాడు.

రామారావుకి ఇదంతా ఎంతో వింతగాను, ఆశ్చర్యంగాను వుంది. తన భార్య ప్రవర్తనకు విస్తుపోతున్నాడు.

'రాధేనా! తన భార్యేనా!?' అనుకున్నాడు.

చుట్టాలు వచ్చారేమోనని గదంతా కలియజూశాడు. నిద్రపోతున్న పిల్లలు తప్ప వేరెవరూ కనిపించలేదు. అలాంటి ఛాయలు కూడా లేవు.

ఈ పాటికి ఇల్లు ప్రశ్నలతో, వాదనలతో హోరెత్తిపోవాలి. అదేదో సినిమాలోలా రాధ గాని మౌనపోరాటం చేస్తుందా అన్న అనుమానం కూడా వచ్చింది రామారావుకి.

ఈ నిశ్శబ్దం తుపాను ముందు ప్రశాంతతా? అర్థం కాలేదు రామారావుకి.

ఇంటి వాతావరణం ఇంత ప్రశాంతంగా వుండడం ఎంతో అశాంతిగా వుంది రామారావుకి. దీనిని భరించ లేకపోతున్నాడు.

ఇంట్లో ఏదయితే తను లేదనుకుంటున్నాడో, ఏది కావాలని ఆరాటపడుతున్నాడో తీరా అది దొరికేసరికి స్వీకరించలేక గిలగిలలాడిపోతున్నాడు రామారావు. దేవుడి కోసం తపస్సు చేసి చేసి తీరా ప్రత్యక్షమయ్యే సరికి ఏం కోరుకోవాలో తెలియని వెర్రిభక్తుడిలా వుంది రామారావు పరిస్థితి.

'ఏవలా వున్నావ్?!' తన గొంతు తనకే వింతగా విచిత్రంగా అనిపించింది రామారావుకి.

'బాగానే వున్నానే!' చిరునవ్వుతో సమాధానమిచ్చింది రాధ.

సంభాషణని ఎలా పొడిగించాలో అర్థం కాలేదు రామారావుకి.

'స్నానానికి నీళ్ళు పెట్టాను. చేసొస్తే భోజనం వడ్డిస్తాను' అంది రాధ తువ్వాలు భర్త చేతికిస్తూ.

తువ్వాలు అందుకుని పెరట్లోకి వెళ్ళాడు రామారావు.

'వేణ్ణీళ్ళు పెట్టలేదా?' కేకేసాడు భార్యని.

'లేదు' అన్నది రాధ లోపల్నుంచే.

అవకాశం దొరికినట్టయింది రామారావుకి. వెయ్యేనుగుల బలం వచ్చినట్టయింది.

'ఏం? ఎందుకు పెట్టలేదు. అంత రాచ కార్యాలేం వెలగబెడుతున్నావు?' తీవ్రంగా ప్రశ్నించాడు అనడం కంటే రంకె వేసాడనడం సబబేమో.

'మరిచిపోయానండి!' సంజాయిషీ ఇచ్చుకున్నట్టు చెప్పింది రాధ అసలు కారణం అది కాకపోయినా.

'మరిచిపోవడం కాదే! బద్ధకం. తలపొగరు' సంగ్రామ రంగానికి తెరతీసాడు రామారావు.

'అది కాదండీ!' నిగ్రహించుకోవడానికి శతవిధాలా ప్రయత్నం చేస్తూ ఏదో చెప్పబోయింది.

'ఏది కాదే! అసలు నేను చవటనైపోయాను. నువ్వు ఆడింది ఆట. పాడింది పాటగా చెల్లుబాటు అవుతుంటే నీకు కళ్ళు నెత్తికెక్కి పోయాయి' మాటల ఈటెల్ని విసి



## హైకూలు

సరి తూకం
రెండు సీతాకోకలు
ఒక దాని వెనుక మరొకటి

★★★

కొమ్మ చివర కూర్చుని
పిట్ట ఊరకే అరుస్తోంది
నాకెందుకో దిగులు

★★★

తోట ఊడుద్దామంటే
రాలిన ఆకులు
రాలిన పూరేకులు

★★★

జ్ఞాపకం ఒకటి
చెరువులో చేపపిల్లలా
మదిలో

పి. శ్రీనివాస్ గౌడ్


లండన్‌కి
ఒక ఉచిత విమాన
టిక్కెట్టు గెలుచుకోండి

ఇంకా అనేక ఇతర
బహుమతులు

1వ బహుమతి : లండన్‌కి ఒక రిటర్న్ విమాన టిక్కెట్టు, లేదా హీరో హోండా మోటారు సైకిలు.

2వ బహుమతి : 20 గ్రాముల బంగారు నగల సెట్టు లేదా కలర్ టి.వి. సెట్టు.


ఆశ్చర్యపరిచే బహుమతులు : స్టీరియో డెక్/రిస్ట్‌వాచ్/కలర్ ఫోటోగ్రాఫిక్ కెమెరా అండర్ ఎమ్.బి. సిస్టమ్స్.



ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు కేవలం పోస్టు కార్డుపైనే వ్రాసి 7 రోజుల లోపున పంపించండి. ఒక కుటుంబం ఒక్క ఎంట్రీ మాత్రమే పంపించాలి.

1. 1998వ సంవత్సరపు ఉత్తమ క్రికెట్ జట్టు ఏదో ఊహించి చెప్పండి ______ (భారత దేశం/శ్రీలంక/దక్షిణాఫ్రికా)
2. భారత దేశంలో ఓటు వేసేందుకు కనీస వయసు______ (18 ఏళ్ళు/21 ఏళ్ళు)
3. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో ఏ పార్టీకి అత్యధికంగా సీట్లు లభిస్తాయి______ (కాంగ్రెసు/బిజెపి/యునైటెడ్ ఫ్రంట్)
4. భారత దేశంలో అత్యంత సుందరమైన నగరం______ (న్యూ ఢిల్లీ/బెంగుళూరు/ముంబయి)

మీ ఎంట్రీని ఈ చిరునామాకి పంపించండి : UNISEF ENTERPRISES (W-I)
6, INDUSTRIAL AREA, DELHI-110 094



రేస్తున్నాడు రామారావు.

'కిరసనాయిలు లేదు' అసలు విషయాన్ని చెప్పకుండా దాచాలని ప్రయత్నం చేసినా సాధ్యం కాకపోవడంతో చెప్పేసింది రాధ.

'అదిగో! మళ్ళీ మొదలు పెట్టావు' ఎప్పుడూ అదే గోల. అదిలేదు. ఇది లేదు అని. ఆ ఏడుపేదో ఉదయాన్నే ఏడిస్తే తెచ్చే వాణ్ణిగా' విసురుగా అన్నాడు.

'ఈనెల రేషన్ విడిపించుకోలేదు. మీకు రెండు మూడు సార్లు చెప్పినా పట్టించుకోలేదు' సాధ్యమైనంత శాంతంగా బదులిచ్చింది రాధ.

'ఆ! ఏవైనా అంటే ఇదొహటి. పట్టించుకోవడం లేదు. పట్టించుకోక మిమ్మల్ని మాడ్చి చంపుతున్నానా? లేక మీ బాబు గారి ముల్లేమైనా తెచ్చి పోషిస్తున్నావా?' విసురుగా అన్నాడు రామారావు.

ఇక నిగ్రహించుకోలేక పోయింది రాధ. తల్లిదండ్రుల ప్రసక్తి వచ్చేసరికి తట్టుకోలేక పోయింది. పుట్టింటి మమకారం, భర్త పరిహాసం-ఆమె నిగ్రహాన్ని, నిర్ణయాల్ని పటాపంచలుచేసేసాయి.

'మన తిప్పలేవో మనం పడాలి గాని మధ్యన మా వాళ్ళనెందుకు ఆడిపోసుకోవడం? అయినా ఒకళ్ళను అనే ముందు మన గురించి కూడా కాస్త ఆలోచించుకోవాలి' రోషంగానే అంది రాధ.

'ఏమిటే! మాటకు మాట అందిస్తున్నావు. నాలుగు తగల్నియ్యాలా? పురుషాహంకారం దెబ్బతినడంతో రెండో అంకానికి వచ్చేశాడు రామారావు.

ఏం తప్పా? మీ నాన్న సంపాదించింది తాగుడికి తగలేసాడు. నీకు పేకాట తోడయింది. మరింత గొంతు పెంచుతూ రాధ.

వాదోపవాదాలు అలా సాగుతూనే వుంటాయి. స్త్రీహృదయాన్ని చిన్నాభిన్నం చేయడానికి, ఆమె మానాభిమానాల్ని కర్కశంగా కాలరాయడానికి మగాడు ఉపయోగించే అన్నిరకాల శస్త్రాస్త్రాలను ఉపయోగిస్తాడు రామారావు. ఆమె శరీరం అంప. శయ్యే అవుతుంది కనులు పాతాళగంగలే!

'ఛీ! వెధవగోల. ఇంటికొస్తే మనశ్శాంతి వుండదు. ఎవడో చచ్చినట్టు ఏడుపులు, పెడబొబ్బలే. ఛస్తేగాని పీడ విరగడ కాదు' నైతికంగా ఓడిపోయిన విజయం తనదేనన్నట్టు విశ్శ్రమిస్తాడు అతడు.

మనసున విరిగిన అలుగుల్ని వెలికి తీసుకునే ప్రయత్నంలో హృదయాన్ని రక్తపుటేరు చేస్తూ, అవమానాన్ని దహించుకుపోతూ ఈ బ్రతుక్కి ఉత్తరాయణ మెప్పుడా అని నిరాశగా ఎదురుచూస్తూ తనలోతానే కుమిలిపోతూ రాని నిదురకై పరితపిస్తూ వేటగాడి బాణపు దెబ్బకు విలవిలలాడిన భీతహరిణిలా ఆమె.

అకస్మాత్తుగా మెలకువగా రావడంతో కళ్ళు తెరిచి చూశాడు రామారావు. గదంతా నిశ్శబ్దంగా వుంది. నిరాశాపూరిత జీవితాల్లో మినుకుమినుకు మనే ఆశలా, జీరో వాల్టు బల్బు చీకటిని పారద్రోలడానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది. గడ్డం రద్దుకోబోతే గురుకుగా వుంది. చాలా నీరసంగా వున్నట్టనిపించింది. దాహంగా అనిపించి మంచినీళ్ళకై చుట్టూ చూశాడు.

దాదాపు పది రోజులు అయినట్టుంది తను మంచానబడి. కోలుకోవడానికి మరో పది రోజులు పడుతుందేమో. భార్యకోసం వెతికాడు.

తన మంచంపక్కనే చాలీచాలని బల్లపైన తనలోతానే ముడుచుకుపోయి-పత్రహరితం లేని పండుటాకులా, ఎముకలగూడులా నిద్రపోతున్న రాధ. తన అర్థాంగి!

మనసు కలుక్కుమంది రామారావుకి.

అంతరాత్మ నిలదీసింది.మనసు పశ్చాత్తాపంతో పరితప్తమయింది. చదువు నేర్పిన సంస్కారం నిలదీసింది.

'తనెందుకిలా అయిపోయాడు!?'

'తను తనేనా!?'

చిన్నతనం కళ్ళముందు మెదిలి చురుక్కుమనిపించింది.

బాల్యంలో ఎన్ని ఊహలు!!

జీవితాన్ని ఎంత మధురంగా ఊహించుకున్నాడు! భవిష్యత్తుని ఎంతగొప్పగా మలుచుకోవాలని కలలు గన్నాడు!

ఎన్నెన్ని ఆదర్శాలు! ఎన్ని తీర్మానాలు!! అవేవీ!? ఏమంటల్లో కాలిబూడిపోయాయి.

నాన్న తాగుడు, అమ్మ ఏడ్పులు.. నాన్న తిట్లు, అమ్మ శాపనార్థాలు.. నాన్న రాక్షసంగా తన్ని హింసించడం.. తన పన్నెండేళ్ళ లేతప్రాయం భయంతో గజగజ వణికిపోవడం.

తండ్రిపై అంతులేని ద్వేషం.. అమ్మపై అపారమైన ప్రేమ.

నాన్నలా వుండకూడదని, పెద్దయి బాగా చదువుకుని,మంచి ఉద్యోగం చేసి అమ్మని సుఖపెట్టాలని.

ఎన్ని ఊహలో! ఎన్నెన్ని ఆదర్శాలో!

హఠాత్తుగా తండ్రిపోవడం.. కొద్దికాలానికే తల్లీ తండ్రిని అనుసరించడం.. ఏకాకిగా మిగిలిన తన జీవితంలోకి ఎంతో ప్రేమగా రాధని ఆహ్వానించడం.

అన్నీ సినిమా రీళ్ళలా చకచకా జరిగిపోయాయి.

రాధతో తన వైవాహిక జీవితాన్ని బృందవనం చేసుకోవాలనుకున్నాడు.

మొదట్లో కొంతకాలం అలానే సాగిపోయింది. రానురాను పెరుగుతున్న కుటుంబ బాధ్యతలు, చాలీ చాలని జీతం, అప్పులు, వడ్డీలు.. బాధల్ని మరిచిపోవాలనే ఆరాటంతో తనకితెలియకుండానే వ్యసనాల ఊబిలో కూరుకు పోయాడు.

ఎందుకిలా మారిపోయింది తన జీవితం!?

ఎందుకిన్ని వంకరలు తన బ్రతుకులో!!?

తండ్రి ఉద్యోగంతో బాటే అతడి వ్యసనాలూ, తనలోను ప్రవేశించాయా!?

'రాధ.. తన అర్థాంగి.. తను ప్రేమించి పెళ్ళాడిన ఇల్లాలు. తనతో బాటే చదువుకున్న సహాధ్యాయి. కాని అదేం చిత్రమో పెళ్ళయ్యాక తను మారిపోయింది. అయినా దానికీ కాని దానికీ మాటకు మాట జవాబిచ్చింది. ఒకరిమీద ఒకరం పట్టు సాధించుకోవాలనే తపనలో ఇద్దరి జీవితాలు నరకమయ్యాయి. పిల్లలు పెద్ద వాళ్ళవుతున్నారు. ఈ సంసారం ఇలానే కొనసాగితే పిల్లలూ తమలానే తయారవుతారేమో! పిల్లల కోసమైనా తను మారాలి. తన బాల్యమే తన పిల్లలది కాకూడదు.

నిర్ణయంలోనే మనసు నిర్మలాకాశమయింది రామారావుకి. ఏదో తెలీని కొత్తశక్తి ఒంట్లోకి ప్రవేశించి కొన్నైతురిని రగిలించినట్టయింది.

ఆదమరిచి నిద్రపోతున్న భార్యని లేపాలనిపించక బాత్రూం కెళ్ళడానికి తనే లేవబోయాడు.

లేచి తూలి పడబోగా.. అలికిడికి మెలకువ వచ్చిన రాధ గభాలున లేచి పడిపోకుండా పట్టుకుంది.

భార్య కళ్ళలోని ఆదుర్దా, భయం రామారావుని విచలితుడిని చేసింది.

ఇన్నాళ్ళూ మనసుని క్రమ్ముకున్న పొరలు ఒకటొకటిగా కరిగిపోగా అంతరాంతరాలలో దాక్కున్న ప్రేమ, అనురాగం, అనుబంధాలతో నిండుకుని రామారావుని తన నిర్ణయాన్ని మరింత స్థిరపరచుకునేట్టు చేసింది.

అర్థాంగి అనురాగంతో కొత్త జీవితాన్ని గడపాలన్న ఆనందంతో అడుగు ముందుకేశాడు రామారావు.